# హైటెక్ పెళ్ళి

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 18-1-1999)

"తాతయ్యా! రవి పెళ్ళట! టెలిగ్రాం వచ్చింది." మనవడు మధు చెప్పిన వార్త విని విస్తుపోయాడు విశ్వనాథం.

"టెలిగ్రాం ఏమిట్రా? శుభలేఖ లేకుండా ఏకంగా టెలిగ్రాం ఇచ్చేటంత హడావుడేమిటట ?"

"శుభలేఖలా ! ఇంకా ఈ రోజుల్లో శుభలేఖలేమిటి, తాతయ్యా ! టెలిగ్రాం కూడా నీకోసం పంపాడు పెదనాన్న. లేక పోతే అదీ ఉండదు !"

"అంటే, అయినవాళ్ళకెవ్వరికీ తెలీకుండానే పెళ్ళిళ్ళు చేసేసు కుంటున్నారా ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అది కాదు తాతయ్యా ! ఇప్పుడు మీ రోజుల్లోలా శుభ లేఖలు అచ్చు వేయించడం, ఇంటింటికీ వెళ్ళి బొట్టుపెట్టి పెళ్ళిపిలుపు పేరిట ఆర్భాటం చేయటం ఏమీ లేవు మరీ ముఖ్యమైన వాళ్ళను కుంటే టెలిఫోన్‌లో చెప్పేస్తారు. మిగిలిన అందరికీ టీ వీలో ప్రకట నిస్తారు. అంతే ! ఇంకా కావాలనుకుంటే దినపత్రికల్లో వేయిస్తు న్నారు కొంతమంది !" వివరంగా చెప్పాడు మధు.

"ఎంత తీరికలేని బతుకులైతే మాత్రం, ఈ తీరా ?" విస్మ యంగా అన్నాడు

"అవును, తాతయ్యా ! రోజులు మారిపోతున్నాయి. ఎప్పుడూ మీ కాలంలోలానే జరిగిపోవాలంటే ఎలా ?"

"అవునేమోలే కానీ, ఇంతకీ ముహూర్తం ఎప్పుడ్రా ?" ఆసక్తిగా అడిగాడు విశ్వనాథం.

"ఎల్లుండి రాత్రి పదకొండు గంటలకి, తాతయ్యా !"

"అయితే మరి మనం రేపే బయల్దేరాలిగా !"

"ఎక్కడికి? పెళ్ళికా! పెళ్ళి చూసేందుకు ఇక్కడ్నుంచి అదేపనిగా అంతదూరం వెళ్తామా !" పగలబడి నవ్వాడు మధు.

"ఇందులో అంత నవ్వాల్సిందేముందిరా ?" అర్థంకాక అడిగాడాయన.

"అదికాదు, తాతయ్యా! పెళ్ళయిపోయాక ఓ నాలుగైదు రోజులకు టీ.వీ.లో మూడు నిముషాలు రవి పెళ్ళి తతంగం చూపిస్తారు. మనం మన ఇంట్లోనే కూర్చుని వాడి పెళ్ళి చూడచ్చు!"

"పెళ్ళికి వెళ్ళనవసరం లేదా ? ఇంట్లోనే కూర్చుని టీ.వీ.లో చూడాలా ? ఏమిటో అంతా అయోమయంగా ఉంది !" గొణిగినట్లుగా అన్నాడు విశ్వనాథం.

"అదంతేలే, నే కాలేజీకి వెళ్తున్నా, టైమైంది!" అంటూ బయటకు నడిచాడు మధు.

పెద్దకొడుక్కి పుట్టిన ప్రథమ సంతానం రవి. ఎంతో గారాబంగా పెంచారు ఆ ఇంట్లోవాళ్ళంతా అతన్ని. అందరికంటే విశ్వనాథానికి రవి అంటే పంచప్రాణాలు. రాత్రిళ్ళు తన పొట్టమీద పడుకోపెట్టుకుని నిద్రపుచ్చేవాడు. పెద్దకోడలి నిష్ఠూరాలు భరించలేక, భార్య గతించిన కారణంగా ఒంటరిగా మిగిలిపోయిన విశ్వనాథం గత కొన్నేళ్లుగా చిన్నకొడుకు దగ్గర ఉంటున్నాడు. మమకారం చావక మనవడి పెళ్ళి చూడాలని తహతహ పడిపోతున్నాడు.

ఒంటరిగా వెళ్లేందుకు కళ్లూ కాళ్లూ తన ఆధీనంలో లేవు. తనకు తోడుగా వచ్చేందుకు ఎవరికీ తీరికలేదు, కోరికా లేదు. ఏమీ చేయలేని విశ్వనాథం తన కోరికను మనసులోనే అణుచుకున్నాడు.

చివరి ప్రయత్నంగా సాయంత్రం కొడుకుని కూడా ఓసారి

అడిగి చూడాలనుకున్నాడు. కాదంటే మాత్రం వాళ్ళని ఇబ్బంది పెట్టదలుచుకోలేదాయన. యధాలాపంగా పేపరందుకున్నాడు. రవి పెళ్లి ప్రకటన కంటపడింది. మనవడి ఫొటో, పేరు, కిందనే కొడుకు కోడలి పేర్లు చూడగానే ఆయన కళ్ళల్లో నీటి పొర, మనసంతా ఉద్వేగంతో నిండిపోయింది. ఆప్యాయంగా మనవడి ఫొటో తాకి ముద్దుపెట్టుకున్నాడు. తదేకంగా ఆ ప్రకటననే చూస్తూండిపోయాడు చాలా సేపు.

"రవి పెళ్ళిట! మనం వెళ్ళొద్దాంరా!" ఆశగా అడిగాడు ఆఫీసునుంచి వచ్చిన కొడుకుని.

"అంతంత ఛార్జీలు పెట్టుకుని ఎక్కడ వెళ్తాం, నాన్నా! ఆఫీసుకు సెలవు పెట్టడం కూడా కష్టం. పైగా టీ. వీ. లో చూడొచ్చు కదా!"

కొడుకు సమాధానం అసంతృప్తి కలగచేసింది విశ్వనాథానికి. అయినాసరే మరో మాట మాట్లాడకుండా ఉండిపోయాడాయన.

"సరే, కనీసం ఆ టీ.వీ.లో ఆ వేడుక వచ్చే వేళకయినా అందరూ ఇంట్లో ఉండండి!" అన్నాడు ప్రాధేయపడుతున్నట్లుగా.

"వాడి పెళ్లి కళ్ళారా చూసి నాలుగు అక్షింతలు వేద్దామనుకున్నాను!" మనసులోని కోరిక బయటికే అనేశాడు విశ్వనాథం చివరి ప్రయత్నంగా,

"ఇంకా ఈ రోజుల్లో అక్షింతలూ, ఆశీర్వచనాలూ ఏమిటి నాన్నా. చాదస్తం కాకపోతే!" విసుగ్గా అన్నాడు కొడుకు.

వైరాగ్యంతో కూడుకున్న చిరునవ్వు ఆయన పెదవులపై మెరిసింది ఓ క్షణం.

'అనారోగ్యంగా ఉన్నారని తెలిస్తే ఫోనుద్వారా పరామర్శలు, పుట్టినరోజులకు, పెళ్ళిరోజులకు టీ.వీ.ల ద్వారా శుభా

కాంక్షలు తెలియచేయడం, చనిపోయారని తెలిస్తే పేపర్లలో సంతాప ప్రకటనలు... ఇలా తగలడుతున్నాయి మానవసంబంధాలు!

కుశల ప్రశ్నలు వేసుకునేంత తీరుబడి లేదు. కష్టసుఖాలు చెప్పుకునే కలివిడితనం లేదు, ఓదార్పో, ధైర్యమో, సహాయమో, సహకారమో అందించాలన్నా ఆత్మీయతల్లేవు!

సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నామన్న సంబరం తప్ప, సహజీవనంలో ఉండే నిజమైన ఆనందపు రుచిని చవిచూడలేకపో తున్నామన్న స్పృహే కరువైపోతున్నది. అందరూ ఉండికూడా ఎవరికి వారే ఒంటరి బతుకు వెళ్ళదీస్తున్నారు!' కోడలు భోజనానికి పిలవడంతో చుట్టుముట్టిన ఆలోచనల్లోంచి బయటపడ్డాడు విశ్వ నాథం.

అందరూ హాల్లో టీ.వీ ముందు కూర్చున్నారు. మరో అయిదు నిముషాల్లో మనవడి పెళ్ళి వేడుక చూడబోతున్నందుకు ఆనందంగా ఉంది విశ్వనాథానికి. చాలాకాలం తర్వాత అయినవాళ్ళని ముఖ్యంగా మనవడ్ని, కొడుకుని, కోడల్ని, మనుమరాల్ని చూడబో తున్నందుకు ఆయన మనసంతా సంబరంగా ఉంది. అయిదు నిము షాలూ అయిదు యుగాల్లా గడిపాడు. రవి పెళ్ళి ప్రకటన వెలువడింది.

ముందుగా దేవుడి పటం.

తర్వాత కళ్యాణ మండపం ముందు వధూవరుల పేరు రాసి ఉన్న బోర్డు.

కళ్యాణ వేదిక.

పెళ్ళికొడుకు ముస్తాబుతో కనిపించాడు రవి.

మసకబారిన కళ్ళను గట్టిగా తుడుచుకుని చూడసాగాడు విశ్వనాథం.

పెళ్ళికూతుర్ని చూపించారు.

ఒక్క క్షణం కొడుకు, కోడలు నవ్వుతూ కనిపించారు.

విశ్వనాథం గుండె వేగంగాకొట్టుకుంది. అంతకన్నా వేగంగా టి.వీ లో బొమ్మలు మారిపోతున్నాయి.

---

మాంగల్యధారణ.

తలంబ్రాలు.

ఒకదాని వెంట ఒకటి త్వర త్వరగా మారిపోతున్నాయి దృశ్యాలు. అంతలోనే అహూతుల్ని చూపసాగారు. పెళ్ళికి వచ్చిన సినిమా యాక్టర్లని చూసి విస్తుపోయాడు విశ్వనాథం. వాళ్ళు అక్షింతలు వేయడం, వాళ్ళకి వధూవరులు నమస్కారంచేయటం, కార్లలో తరలివెళ్ళడం, అంతలోనే శుభం పడటం జరిగిపోయింది.

ఒక్కసారిగా విశ్వనాథం ముఖం చిన్నబోయింది. "వీళ్ళంతా వీడికి ఎప్పుడింతగా పరిచయం అయ్యారు? పెళ్లికి వచ్చేటంత దగ్గరి వారు ఎలా అయ్యారు?" ఆశ్చర్యంగా అన్నాడాయన.

"వాళ్ళంతా రవి పెళ్లికి రాలేదు, తాతయ్యా! వీడియో వాళ్ళే మనం అడిగితే అలా టేపు తయారు చేసిస్తారు. మనకి ఇష్టమైన యాక్టర్ల పేరు చెప్తే వాళ్లు పెళ్లికి వచ్చినట్లుగా తీయగలరు !" వివరించాడు రవి

"మన బంధువులందరినీ చూడచ్చు కదా అని ఆశపడ్డాన్రా ! ఒక్కరూ కనిపించలేదు. మీ పెదనాన్న కూడా ఒక్క క్షణం అలా కనిపించాడంతే!" నిరాశగా అన్నాడు విశ్వనాథం.

"పెళ్లి అంతా చూపించాలంటే అరవై లక్షలవుతుంది తెల్సా?" వెటకారంగా అన్నాడు మధు.

పెద్దగా నవ్వారు పక్కనే ఉన్న కొడుకూ, కోడలూ.

అంతకన్నా పెద్దగా ఏడ్చాడు మనసులోనే విశ్వనాథం.

— ౦ —